క్లుప్తంగా

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో పూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కల్కిదోన గుట్టపై వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయ ఫౌండర్ చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామశర్మ, కృష్ణమూర్తిశర్మల ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానికులు శ్యాంసుందర్, సుమన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి సన్మానం



ఎస్సీ కార్పొరేషన్ ఈడీను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.పద్మావతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మాడ్గుల మండల సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులకు సకాలంలో అందించి ఆర్థిక చేయూతనివ్వాలని ఈ సందర్భంగా ఈడీని కోరామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కేకు కట్ చేస్తున్న మహిళలు

ఆమనగల్లు: పట్టణంలో మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను కరుణశ్రీ సత్కరించారు. అనంతరం కేకు కట్ చేసి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకలలో స్థానిక మహిళలు సరిత, దర్శిణి, సువర్ణ, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, లక్ష్మి, అనంతలక్ష్మి, వనిత, వరలక్ష్మి, అనిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్, సాయిగౌడ్, మహేశ్, వంశీ, పవన్, వినోద్‌లకు ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, విఠలయ్యగౌడ్, మహిపాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జనార్దన్‌గౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం
- రావిచేడ్‌లో భక్తుల ప్రత్యేక పూజలు



స్వామివారి కల్యాణోత్సవ ఘట్టం

కడ్తాల్: గోవింద నామస్మరణతో మండల పరిధిలోని రావిచేడ్ గ్రామం మార్మోగింది. శ్రీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం భక్తుల జయజయ ధ్వనుల నడుమ మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ ఆలయంలోని కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను చూడ ముచ్చటగా ముస్తాబు చేశారు. పండితులు వింజమూరి రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, చిదంబరం శర్మల మంత్రోచ్ఛారణల మధ్య భూదేవి సమేత శ్రీనివాస స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. ఈ క్రతువులను వీక్షించడానికి గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

ప్రముఖుల సందడి

స్వామి వారి కల్యాణోత్సవానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.



వేడుకలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, నాయకులు



హాజరైన భక్తజనం

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



పటేల్ చెరువు తండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పటేల్ చెరువు తండాలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబాటుకు గురైన గిరిజన తండాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమేగాకుండా, తండాలను ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు జీవిలాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, మోహన్‌నాయక్, రాజునాయక్, ధర్మనాయక్, సురేష్, ఐలయ్య, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఘన స్వాగతం



హుస్సేన్‌నాయక్‌తో ఆచారి తదితరులు

ఆమనగల్లు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు ఆమనగల్లు పట్టణంలో బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు వెళుతున్న ఆయన ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్‌ను స్థానిక బీజేపీ నాయకులు సత్కరించారు. అనంతరం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మణ్, నాయకులు రవిరాథోడ్, ఆనంద్, బాలు, నరేందర్‌రాథోడ్, భాస్కర్, జయరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఆలయ ఉత్సవాలకు ఆహ్వానం



ఏసీపీ రంగస్వామికి ఆహ్వానపత్రిక అందిస్తున్న శ్రీశైలం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం దేవునిపడకల్‌లో ఈనెల 13న ప్రారంభమయ్యే శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆలయ నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో ఏసీపీ రంగస్వామిని మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం, నాయకుడు రాజు కలిసి ఆహ్వానించారు. కడ్తాలలో మార్కెట్ చైర్‌పర్సన్ గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ కడ్తాల మండల అధ్యక్షుడు బిచ్యానాయక్‌లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, బుచ్చయ్య, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య రానివ్వం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని



సమావేశంలో అధికారులు, గ్రామస్తులు

మంచాల: వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చెన్నారెడ్డిగూడలో తాగు నీటి సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. చెన్నారెడ్డిగూడలో స్కీం బోర్లు ఏర్పాటుపై చర్చించారు. గతంలో ఉన్న బోర్లను తిరిగి ఉపయోగంలోకి తీసుకొని నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. ఎమ్మెల్యే తాగు నీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మంచాల పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్, మాజీ ఎంపీటీసీ లాలు, మాజీ ఉప సర్పంచ్ పరమేష్, నాయకులు కిషన్, కృష్ణ, శ్రీశైలం, లక్ష్మణ్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కడ్తాల్: మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండాలో బుధవారం మధ్యాహ్నం పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తండాలో ఇళ్లులేని నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు.

అస్మత్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

మంచాల: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్యుడు ఎం.ఎస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అస్మత్‌పూర్‌లో సాధురం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ అశ్వల బాలరాజు, స్థానికులు శివ, గాలయ్య, మల్లయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

130 మందికి కంటి పరీక్షలు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో మంగళవారం సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో శ్రీ సాయి ఆప్టికల్స్ నిర్వాహకులు, కంటి వైద్యుడు కొత్త మల్లేశ్ ఆధ్వర్యంలో దాదాపు 130 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 70 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రావణి, గీత, షబానా తదితరులు పాల్గొన్నారు. శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో ప్రతి నెల మొదటివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మల్లేశ్ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

షాబాద్: ఆత్మవిశ్వాసమే ఆయుధంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సూపరింటెండెంట్ రాములు పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెళ్లిలో మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మహిళలు నైపుణ్యాలను నేర్చుకొని, ఆత్మవిశ్వాసంతో తమ కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు.

ఉద్యోగ నియామకాలు చేపటొద్దు



ఆమనగల్లు: తలకొండపల్లిలో రిలే నిరాహార దీక్ష

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమాదిగ
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



యాచారం: రిలే నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేసిన తరువాతే పోటీ పరీక్షల ఫలితాలను ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం దీక్షను గట్టుప్పలపల్లి మాజీ సర్పంచ్ వెంకటయ్యయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనుమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రామచంద్రయ్యమాదిగ, నాయకులు నారాయణమాదిగ, జాన్‌వెస్లీ, మల్లేశ్, విజయ్, భీముడు, కృష్ణయ్య, శరత్, కుమార్, పాండు, జంగయ్య, భాస్కర్, ఉపేందర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం

యాచారం: ఎస్సీ వర్గీకరణ చట్టం తెచ్చే వరకు గ్రూప్ పరీక్షల ఫలితాలు ప్రకటించవద్దని ఎమ్మార్పీఎస్ శ్రేణులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకు నిరసనగా మంగళవారం యాచారం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రిజర్వేషన్ చట్టం అమలు చేసేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని కోరారు. లేని పక్షంలో మాదిగ, మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మూలి మహేష్, నాయకులు క్రిష్ణ, జంగయ్య, బాలరాజ్, ముత్యాలు, సతీష్, లింగం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

- బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

మహేశ్వరం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తామని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలో సిరిగిరిపురం గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ.5 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో గ్రామంలో మరిన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. గ్రామానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తడకల పోచయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుండె రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవ కొమురయ్య, గ్రామపెద్దలు బండ రాజేందర్, శ్రీను, సత్యనారాయణ చారి, పాండుచారి, గండికోట నర్సింహ, గండికోట బాబు, దాసయ్య, మహేశ్ పలువురు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మురుగు.. పరిష్కారమేలా అడుగు



తుర్కయంజాల్: ఇళ్ల మధ్యనే నెలల తరబడి మురుగు నీరు పొంగి పొర్లుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక రాగన్నగూడలోని జీవీఆర్‌నగర్ కాలనీలో ఆవాస్ అపార్ట్‌మెంట్ సమీపంలో ఇళ్ల మధ్య ఆరు నెలలుగా మురుగు నీరు ప్రవహిస్తుంది. దీంతో దోమలు, ఈగలు వ్యాపించడంతో పాటు, దుర్వాసన వ్యాపిస్తోంది. ఇప్పటికీ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయామని అయినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి స్పందిస్తూ.. వెంటనే సిబ్బందిని పంపించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం మండల తహసీల్దార్ వేణుగోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో కబ్జాకు గురవుతున్న సర్వే నెం–24లోని రెవెన్యూ ప్లాట్లను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు చెందిన ఈ భూములు అక్రమంగా ఇతరుల చేతికి వెళ్లకుండా కాపాడేందుకు బోర్డులను ఏర్పా టు చేయాలన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల హక్కులను పరిరక్షించేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ అర్హుడికి అందించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో శాతెల్లి నాగరాజు ఉన్నారు.

అభివృద్ధి రంగంలో సాంకేతికత కీలకం

మొయినాబాద్: అభివృద్ధి, పరిశోధన రంగాల్లో సాంకేతికత కీలకమని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజుల పాటు హ్యాక్‌స్మార్ట్–2025 పేరుతో నిర్వహించిన హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి 28 బృందాలు పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకతను ప్రదర్శించాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సదస్సు కన్వీనర్ రాంబాబు ముదుసు, ఐజెన్ లాబ్స్ సీఈఓ ఆదర్శ్ కోదండ, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘ఫ్యూచర్’ పేరుతో గ్రామాలకు అన్యాయం

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్



మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: ఫ్యూచర్ సిటీ పేరుతో ఏర్పాటు చేయనున్న కార్పొరేషన్‌లో కొన్ని గ్రామాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో పునర్విభజనలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో కలిసిన కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, ఆమనగల్లు మండలాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కందుకూర్, కడ్తాల్, యాచారం, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మంచాల మండలాల పరిధిలో రెవెన్యూ గ్రామాలను తీసుకుని ఫ్యూచర్ సిటీ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్పొరేషన్‌లో కడ్తాల్ మండలానికి సంబంధించిన ఆరు గ్రామాలు, ఆమనగల్లులోని రెండు గ్రామాలను కలపడం తగదన్నారు. కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లోని పూర్తి స్థాయిలో అన్ని గ్రామాలను కలుపుకొని ఫ్యూచర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అంతకుముందు అన్ని గ్రామాలను కలిపి ఫ్యూచర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను మైసిగండిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నేతలు యాదయ్య, తులసీరాం, భూనాథ్‌నాయక్, హరిచంద్‌నాయక్, లోకేశ్‌నాయక్, నర్సింహగౌడ్, రమేశ్, పంతునాయక్, పాండు తదితరులు పాల్గొన్నారు.